


'యాంత్రీకరణ'కు మోక్షం

వ్యవసాయ యాంత్రీకరణకు గ్రహణం వీడింది. రైతులకు 50 శాతం రాయితీతో పరికరాలు అందించాలని సర్కారు నిర్ణయించింది. 8లో



గరిష్టం / కనిష్టం
38° / 22°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం ప్రారంభ మయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. తెల్లవారుజామున, రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఎస్పీకి సీఆర్‌పీఎఫ్ అధికారుల అభినందన

కొత్తగూడెంటౌన్: జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు ఇతర శాఖలను సమన్వయం చేస్తూ గత లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేసిన ఎస్పీ రోహిత్‌రాజును సీఆర్‌పీఎఫ్ ఐజీపీ చారూసిన్హా అభినందించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం అందజేశారు. మావోయిస్టు ప్రభావిత జిల్లా అయినప్పటికీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేసి సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించారని ప్రశంసించారు. కాగా, జిల్లాలో పోలీసులతో పాటు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని ఎస్పీ తెలిపారు.

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా రాజమల్లు



కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా మెండు రాజమల్లును నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ద్వారా సోమవారం ఆయన అందుకున్నారు. అనంతరం చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత జిల్లా జడ్జి పాటిల్ వసంత్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.భానుమతి, రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు పలివెల సాంబశివరావు, రమేష్‌కుమార్, సూరెడ్డి రమణారెడ్డి, గాదె సునంద పాల్గొన్నారు.


నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యం



నూతనంగా ఏర్పాటుచేసిన బ్రేకర్ వద్ద ఎస్ఈ, అధికారులు

దుమ్ముగూడెం : అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా తమ శాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని లచ్చిగూడెం సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్‌ను ప్రారంభించారు. గతంలో లచ్చిగూడెం – గుర్రాలబైలు గ్రామాలకు కలిపి ఒకటే బ్రేకర్ ఉండగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడేది. దీంతో నూతన బ్రేకర్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ జీవన్‌కుమార్, ఏడీఈ ప్రభాకర్‌రావు, ఏఈ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కార్పొరేషన్ !



కొత్తగూడెం పట్టణ వ్యూ

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ స్వరూపం

ప్రాంతం	జనాభా	వైశాల్యం
కొత్తగూడెం	97,337	15.87 చ.కి.మీ
పాల్వంచ	89,721	40.87 చ.కి.మీ
సుజాతనగర్	11,124	28.48 చ.కి.మీ
మొత్తం	1,98,182	85.22 చ.కి.మీ

అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లు

- ఎన్ఎండీసీ, బయ్యారం ఉక్కు, జీవో 76పైనా చర్చ
- షెడ్యూల్ ఏరియా సమస్యల ప్రస్తావన
- బడ్జెట్ సమావేశాల్లో 'భద్రాద్రి' సంగతులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ – కొత్తగూడెం మున్సిపాలిటీలు, సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామపంచాయతీలను ఏకం చేస్తూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈనెల 18న కొత్తగూడెం కార్పొరేషన్ బిల్లును సభలో ప్రవేశపెట్టగా.. సోమవారం చర్చను ప్రారంభించారు. ఓటింగ్‌లో మెజారిటీ సభ్యుల సమ్మతితో బిల్లు ఆమోదం పొందినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఈ బిల్లుపై గవర్నర్ సంతకం చేయగానే చట్టంగా మారుతుంది. ఆ వెంటనే ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. అప్పటి నుంచి కొత్తగూడెం – పాల్వంచ – సుజాతనగర్ (ఏడు గ్రామ పంచాయతీలు)తో కూడిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అమల్లోకి వస్తుంది. ఇప్పటికే ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో నగరాభివృద్ధి పద్దు కింద కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించిన విషయం విదితమే.

ఎన్ఎండీసీపై దృష్టి పెట్టాలి..

పాల్వంచలో ఎన్ఎండీసీకి చెందిన 500 ఎకరాల స్థలాన్ని వినియోగంలోకి తేవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జీరో అవర్ సందర్భంగా జిల్లాకు సంబంధించిన కీలక అంశాలను ఆయన సభలో ప్రస్తావించారు. స్పాంజ్ ఐరన్ పరిశ్రమకు ఒకప్పుడు ఆసియా ఖండంలోనే ప్రత్యేక గుర్తింపు ఉండేదని, ఈ పరిశ్రమ మూతపడిన తర్వాత ఈ స్థలం ఎన్ఎండీసీ పరిధిలో నిరుపయోగంగా ఉందని కూనంనేని తెలిపారు. దీన్ని ఉపయోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని, బయ్యారం ఉక్కు పరిశ్రమపై కూడా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

చర్చకొచ్చిన షెడ్యూల్ సమస్యలు..

షెడ్యూల్ ఏరియాల్లో గౌడలు పెద్ద సంఖ్యలో ఉన్నారని, అయితే కల్లు గీసే విషయంలో వారికి ఎలాంటి హక్కులు లేవని, స్థానిక సర్దుబాటుతోనే గీత కార్మికులు పని చేస్తున్నారని కూనంనేని అసెంబ్లీ దృష్టికి తెచ్చారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగినప్పుడు గీత కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదన్నారు. షెడ్యూల్ ఏరియాలో గీత కార్మికులను ఆదుకునే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. దీంతో పాటు సింగరేణి ప్రాంతాల్లో క్రమబద్ధీకరణకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చిన జీఓ 76ను వేగంగా అమలు చేస్తే ప్రజలకు, ప్రభుత్వానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంబ సత్రం భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు లేక రైతు భరోసా పొందలేకపోతున్నారని తెలిపారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో విలీనమయ్యే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి హామీ పథకం వర్తించేలా చూడాలని కోరారు.

యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలి..

కొత్తగూడెం ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే కూనంనేని ప్రభుత్వాన్ని కోరారు. 500 ఎకరాల్లో విస్తరించిన ఈ కాలేజీని యూనివర్సిటీగా మారిస్తే ఖనిజ సంపదను వినియోగంలోకి తెచ్చే వీలు కలుగుతుందన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సైతం అసెంబ్లీలో ఇదే విషయాన్ని లేవనెత్తారు.

అందరికీ ధన్యవాదాలు



కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు సహకరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు. మున్సిపల్ అధికారులు దానకిశోర్, శ్రీదేవి, గౌతమ్, జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు ధన్యవాదాలు. కొత్తగూడెం ప్రజల తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి స్పెషల్ థ్యాంక్స్. కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయంతో పాతికేళ్ల తర్వాత పాల్వంచలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి.

–కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

భద్రగిరి అభివృద్ధికి హామీలిచ్చేనా..?

- శ్రీరామనవమికి సీఎం రాక దాదాపు ఖరారు !
- డెవలప్‌మెంట్ అథారిటీ ప్రస్తావనపై ఆశలు



రామాలయం వ్యూ

భద్రాచలం: శ్రీరామనవమికి సీఎం హాజరు కావాలనే భద్రాచలం వాసుల కోరిక ఈ ఏడాది తీరనుంది. 'నవమికి సీఎం సారొస్తార'ని స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్లారిటీ ఇచ్చారు. దీనికి తోడు కల్యాణానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆలయ ఈఓ, వైదిక కమిటీ ఆహ్వానించిన సమయంలో అభివృద్ధి, భూ సేకరణపై ఆయన అధికారులను ఆరా తీయడంతో దాదాపుగా సీఎం హాజరవుతారని ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌కు ఉన్నతాధికారులు సమర్పించే నివేదికలో సామాన్య భక్తులకు అందించాల్సిన వసతులు, డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు, నిధుల మంజూరు వంటి అంశాలను కూడా పొందుపర్చాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

భూసేకరణపై ఆరాతో ఆశలు..

ఆలయ అభివృద్ధిలో భాగంగా తొలుత మాఢ వీధుల విస్తరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు భూ సేకరణకు అవసరమైన నిధులు కేటాయిస్తూ జీఓ విడుదల చేసింది. దీంతో ఆర్డీఓ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి భూ సర్వేతో పాటు ఇళ్ల స్థలాలు కోల్పోతున్న వారితో సంప్రదింపులు చేశారు. అయితే ఇది జరిగి రెండు నెలలు గడుస్తున్నా భూ, ఇళ్ల నిర్వాసితులకు అందాల్సిన నిధులు మాత్రం విడుదల కాలేదు. కాగా ఆదివారం భద్రాచలం వచ్చిన మంత్రి పొంగులేటి కల్యాణానికి సీఎం వస్తారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మాఢ వీధుల విస్తరణ, అభివృద్ధి పనులకు కల్యాణం రోజునే ప్రారంభోత్సవం చేస్తారని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు నిర్వాసితులకు మూడు రోజుల్లో నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిని ఆలయ అధికారులు కలిసినప్పుడు కూడా అభివృద్ధి పనులు, భూ సేకరణ వివరాలను ఆయన అడిగారు. పటిష్ట నివేదిక, ప్రణాళిక అందజేయాలని ఆదేశించారు. అయితే నష్టపరిహారం చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది.

నివేదికలో ఇవి పొందుపరిస్తే మేలు..

భద్రాచలం ఆలయ అభివృద్ధికి అధికారులు అందజేసే నివేదికలో పట్టణ అభివృద్ధిపై సైతం పొందుపర్చాలని స్థానికులు కోరుతున్నారు. వారి డిమాండ్‌లు ఇలా ఉన్నాయి.

- రామాలయ అభివృద్ధికి పటిష్ట మాస్టర్ ప్లాన్ రూపొందించాలి
- ఆలయ అభివృద్ధితో పాటు సామాన్య భక్తులకు అవసరమైన వసతులపై దృష్టి సారించాలి
- భక్తుల వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- భద్రాచలంతో పాటు పర్ణశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి
- ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను కలిపేలా స్పెషల్ కారిడార్ రూపొందించాలి
- ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలి
- గోదావరి వరదల సమయంలో ఏజెన్సీ ప్రాంత ప్రజలను ముంపు నుంచి తప్పించేందుకు కరకట్ట ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలి
- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ప్రసాద్ పథక అమలు తీరును నిరంతరం పర్యవేక్షించేలా సమన్వయం చేయాలి
- ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న రామయ్య భూముల విషయంలో న్యాయపరమైన చిక్కులు తొలగేలా చర్యలు తీసుకోవాలి
- ఏపీలో విలీనమైన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలిపేలా ఇరు రాష్ట్రాల సీఎంలు చర్చించాలి. తద్వారా భద్రాచలం అభివృద్ధికి అవసరమైన స్థల సమస్య తీరుతుంది.

క్షయ లక్షణాలుంటే పరీక్ష చేయించుకోండి



ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. ప్రపంచ టీబీ డే సందర్భంగా సోమవారం కొత్తగూడెంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు వారాలుగా దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు తెమడ పడడం, తెమడలో రక్తం పడటం, గడ్డలు వంటివి ఉంటే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి తెమడ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. మందులు వాడుతున్నంత కాలం నెలకు రూ.1000 పోషణ భత్యం నిమిత్తం నిక్షయ పోషణ యోజన పథకం ద్వారా నేరుగా పేషెంట్ ఖాతాలో జమ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు 12,249 మంది హాజరు

కొత్తగూడెంఅర్బన్ : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. మూడో రోజు సోమవారం జరిగిన ఆంగ్లం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్, ప్రైవేట్ కలిపి 12,249 మంది విద్యార్థులు హాజరయ్యారని, 42 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక సెంటర్, జిల్లా పరిశీలకులు విజయలక్ష్మీబాయి నాలుగు, తాను 8, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 31 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని వివరించారు.

పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- రోయింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచన
- పగిడేరులో జియోథర్మల్, తుమ్మలచెరువు సందర్శన



జియో థర్మల్ ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

మణుగూరు టౌన్/అశ్వాపురం : మణుగూరు మండలంలోని కొండాయిగూడెం వద్ద గోదావరి, రథంగుట్ట, సింగరేణి, అంబేద్కర్ పార్క్, పగిడేరు జియోథర్మల్‌ను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం మణుగూరులో పర్యటించిన ఆయన జియో థర్మల్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం సాంబాయిగూడెం ఇసుక క్వారీ వద్ద లారీ యజమానులతో మాట్లాడారు. పరిమితికి మించి ఇసుక లోడ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లోడింగ్ వద్ద డబ్బులు వసూలు చేస్తే చర్య తప్పదని హెచ్చరించారు. అంతకుముందు అశ్వాపురం మండలం మల్లెలమడుగు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలను పరిశీలించారు. పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత నెల్లిపాకలో మంద్రు నాగసుధీర్ అనే రైతు సాగు చేస్తున్న మునగ పంటను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మునగకాయలతో పాటు ఆకు కూడా అమ్మి ఆర్థికాభివృద్ధి సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు. అనంతరం తుమ్మలచెరువు వద్ద రోయింగ్ వాటర్ స్పోర్ట్స్ శిక్షణ ఇస్తున్న అంతర్జాతీయ రోయింగ్ క్రీడాకారుడు యలమంచిలి కిరణ్‌తో మాట్లాడారు. శిక్షణకు ఎంత మంది వస్తున్నారు.. యువకులు ఆసక్తి చూపుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భారజల కర్మాగారంలో..

మణుగూరు భారజల కర్మాగారాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. జీఎం హెచ్‌కే.శర్మ, అధికారులతో సమావేశమై పలు అంశాలపై కలెక్టర్ చర్చించారు. గోదావరి నుంచి నీరు సేకరించి భారజలం ఉత్పత్తి అయ్యాక మిగిలే నీటిలో మినరల్స్ కలిపి వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపాధి కల్పించవచ్చని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మణుగూరు, అశ్వాపురం తహసీల్దార్లు రాఘవరెడ్డి, స్వర్ణలత, ఎంపీడీఓలు శ్రీనివాస్, వరప్రసాద్, ఏపీఎం సత్యనారాయణ, ఎంపీఓ ముత్యాలరావు, ఆర్‌ఐ లావణ్య, ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



ములకలపల్లి : విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: అర్హులైన ప్రతీ గిరిజనుడికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌కు హాజరైన వారి నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. వారి వినతులను యూనిట్ అధికారులకు అందజేసి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అర్హులైన గిరిజన కుటుంబాలకు విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నాణ్యమైన క్రీడా సామగ్రి పంపిణీ చేయాలి

టెండర్ నిబంధనల మేరకు విద్యార్థులకు నాణ్యమైన క్రీడా సామగ్రి, దుస్తులు సరఫరా చేయాలని పీఓ టెండర్‌దారులకు సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలలకు సరఫరా చేసే టీ షర్ట్, షార్ట్, ట్రాక్ షూట్ క్రీడా సామగ్రి టెండర్ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. టెండర్ సమయంలో చూపిన శాంపిల్ ప్రకారమే సరఫరా చేయాలని, కోచ్‌లు, ప్రధానోపాధ్యాయులు పరిశీలించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారి లైసెన్స్‌లు రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గిరిజన మ్యూజియంలో పనులు పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాలల్లో ఐటీడీఏ ఏపీఓ జనరల్ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఏఓ సున్నం రాంబాబు, ఎస్ఓ ఉదయభాస్కర్, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, ఏపీఓ వేణు, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తనిఖీ..

ములకలపల్లి : మండల పరిధిలోని కమలాపురం ఆశ్రమ పాఠశాల హాస్టల్‌ను పీఓ రాహుల్ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. హాస్టల్‌లోని మొదటి అంతస్తు గదిలో షార్ట్‌సర్క్యూట్‌తో క్రీడా వస్తువులు, పాత పరుపులు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పీఓ హాస్టల్‌ను సందర్శించి ఘటన వివరాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

వారికి 'ఆధారం' లేదు

- ఆధార్ కార్డుల్లేక రెండేళ్లుగా ఇబ్బందులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- గ్రీవెన్స్‌లో అయినా పరిష్కారం దొరుతుందనే ఆశ..

కేంద్ర ప్రభుత్వం జారీ చేసే అత్యున్నత గుర్తింపు కార్డుల్లో ఒకటైన ఆధార్ లేక గిరిజన దంపతులు మూడేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ కార్యాలయం మొదలు కలెక్టరేట్ వరకు చెప్పులరిగేలా తిరుగుతున్నా వారి సమస్యకు పరిష్కారం లభించడం లేదు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర అక్షరాస్యత 75 శాతంగా ఉంటే జిల్లా సగటు 73 శాతంగా ఉంది. జిల్లాలో 43 శాతం అడవులే ఉన్నాయి. గిరిజన జనాభానే ఎక్కువ. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్య కోసం ఐడీఓసీలో నిర్వహించే గ్రీవెన్స్‌కు వస్తున్నారు. అయితే దరఖాస్తులు ఎలా రాయాలో తెలియక అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. చిన్న సమస్యలకే మళ్లీ మళ్లీ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో గ్రీవెన్స్‌సెల్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఆగిన సంక్షేమం



పాల్వంచ మండలం పాండురంగాపురంలో వాంకుడోతు మోంగ్యా, భద్రి దంపతులు జీవిస్తున్నారు. ఇద్దరిదీ ఇదే గ్రామం. ఇక్కడే పెళ్లి చేసుకుని, ఇన్నేళ్లుగా ఇక్కడే ఉంటున్నారు. ఓటరు గుర్తింపు కార్డులో మోంగ్యా 1951లో పుట్టినట్టుగా వివరాలు ఉన్నాయి. ఆ తర్వాత కాలంలో ఈ కుటుంబ సభ్యులకు ఆధార్‌కార్డులు కూడా వచ్చాయి. దీంతో పాటు ప్రభుత్వం అందించే ఉపాధిహామీ పథకం, ఆసరా పింఛన్లు, రేషన్ బియ్యం వంటి సంక్షేమ పథకాలూ అందాయి. కానీ మూడేళ్ల క్రితం మోంగ్యా, భద్రిల ఆధార్‌లో సమస్యలు వచ్చాయి. బయోమెట్రిక్ హాజరు నమోదైన తర్వాత వీరి వేలి ముద్రలు ఆధార్‌తో మ్యాచ్ కావడం లేదు. దీంతో గత మూడేళ్లుగా ఉపాధి హామీ, పింఛన్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. వయసు పైబడి, ఒంట్లో శక్తి సన్నగిల్లుతున్న తరుణంలో ఈ సమస్య రావడంతో ఇబ్బంది పడుతూనే ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవా సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఒకటికి రెండు సార్లు ఓటర్ ఐడీలు తీసుకున్నారు. అందుబాటులో ఉన్న జిరాక్స్ కాపీలు పట్టుకుని ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నిరక్షరాస్యులైన ఈ దంపతులకు ఎదురైన సాంకేతిక సమస్యకు జిల్లా ఉన్నతాధికారులే పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంది.

ఆర్థికంగా అండ కావాలి



కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామానికి చెందిన జిమ్మిడి శ్రీనుకు ప్రస్తుతం 47 ఏళ్లు. ఇరవై ఏళ్ల క్రితం వరకు జీవితం సాఫీగానే సాగింది. ఆయనకు 27 ఏళ్లు ఉన్నప్పుడు కనుబొమ్మ దగ్గర నొప్పి రాగా, ఓ ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజెక్షన్ వికటించింది. నాటి నుంచి కన్ను, కాలు, చేయి పని చేయకుండాపోయాయి. అప్పటి వరకు అరెకరం సొంత పొలానికి తోడు మరికొంత కౌలుకు తీసుకుని వ్యవసాయం చేయగా.. అతడి జీవితానికి బ్రేకులు పడ్డాయి. అయినా నమ్మకం కోల్పోకుండా ఇంటి వద్దే కిరాణా షాపు పెట్టుకుంటే నష్టాలు రావడంతో అది మూతబడింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులపైనే ఆధారపడి జీవిస్తున్నాడు. ప్రస్తుతం తాటిగూడెం వరకు నాణ్యమైన రోడ్డు నిర్మిస్తుండగా.. ఆ పని పూర్తయి రోడ్డు బాగుంటే కిరాణా షాపు మళ్లీ పుంజుకుంటుందని, తద్వారా తన కాళ్లపై తాను నిలబడే అవకాశం వస్తుందని నమ్మకంతో ఉన్నాడు. అయితే షాపు ఏర్పాటుకు అవసరమైన రుణం ఇప్పించాలని గ్రీవెన్స్‌కు వచ్చి అధికారులను వేడుకున్నాడు.

క్లుప్తంగా

రామయ్య సన్నిధిలో జడ్జి



ఆలయంలో చెన్నై హైకోర్టు జడ్జి శివగ్నానమ్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని చెన్నై హైకోర్టు జడ్జి శివగ్నానమ్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. శ్రీ అభయాంజనేయస్వామి ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనం జరిపి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, కత్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యను..

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని చెన్నై హైకోర్టు జడ్జి శివగ్నానమ్ కుటుంబసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐ గణేష్, ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సింగరేణి విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థిని వెన్నెలను అభినందిస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 19న ఖమ్మంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో సింగరేణి మహిళా కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఫెస్టివల్‌కు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి 108 మంది హాజరు కాగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందికి ఎంపిక చేసి బహుమతులు అందించారు. సింగరేణి కళాశాల విద్యార్థినులు కె.వెన్నెల, ఎండీ ఆయేషా మూడో, నాలుగో స్థానాల్లో నిలవగా సోమవారం ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, కరస్పాండెంట్ కే.సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ చింతల శారద తదితరులు అభినందించారు.

నేత్రదానం

టేకులపల్లి: మండలంలోని బోడు గ్రామానికి చెందిన పంజాల సముద్ర(60) కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆమె కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. కాగా మృతురాలికి భర్త రాములు, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మున్నేటిలో ఈతకు వెళ్లిన యువకుడు మృతి

ఖమ్మంరూరల్: ఖమ్మం బాలాజీనగర్‌కు చెందిన సయ్యద్ మౌలానా అలియాస్ అఫ్రోజ్ (21) రాజీవ్ గృహకల్ప వద్ద మున్నేటికి వెళ్లగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. పలువురు స్నేహితులతో కలిసి ఆయన సోమవారం సరదాగా వెళ్లాడు. అయితే, మౌలానాకు ఈత రాకపోవడంతో నీటిలోకి దిగగానే మునిగిపోసాగాడు. ఆయన వెంట ఉన్న వారికి కూడా ఈత రాక రక్షించే అవకాశం లేకపోవడంతో మృతి చెందాడు. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న మౌలానా కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న సీఐ ముష్క రాజు, పోలీసులు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ఐదుగురిపై పోక్సో కేసు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం హరిజనవాడ పంచాయతీకి చెందిన బాలికను(17)ను ప్రేమ పేరిట మాయమాటలతో నమ్మించి గర్భవతిని చేసి వ్యక్తితో పాటు పలువురిపై పోక్సో కేసు నమోదైంది. ప్రధాన నిందితుడైన ముల్లంగి జమలయ్యతో పాటు ఆయన తల్లిదండ్రులు ముసలయ్య - మరియమ్మ, బాలికను అబార్షన్‌ను ప్రేరేపించిన ఆర్ఎంపీ నరేందర్, గర్భ విచ్ఛిత్తికి ప్రయత్నించిన నర్సు భవానీపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై పి.వెంకటేష్ తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

ములకలపల్లి: గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. రాజుపేట శివారులో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని, రూ 1,500 నగదు, మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

‘యాంత్రీకరణ’కు మోక్షం

- 50శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు
- తొలుత మహిళా రైతులకు ప్రాధాన్యం
- దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయశాఖ



వ్యవసాయ పరికరం

బూర్గంపాడు: వ్యవసాయ యాంత్రీకరణకు ఎట్టకేలకు గ్రహణం వీడింది. ఏడేళ్లుగా నిలిచిన పథకానికి ప్రభుత్వం మళ్లీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రైతులకు 50 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలు, పనిముట్లు అందించేందుకు సర్కారు నిర్ణయం తీసుకుంది. 14 రకాల వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందించేందుకు వ్యవసాయ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. తొలుత మహిళా రైతులకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. తొలివిడతలో ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు పనిముట్లు అందించాలని భావిస్తోంది.

జిల్లాకు రూ.కోటి నిధులు

తొలివిడతగా వ్యవసాయ యాంత్రీకరణ కోసం జిల్లాకు రూ. కోటి నిధులు కేటాయించింది. ఈ నిధులను కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట వ్యవసాయ డివిజన్లకు విభజించి కేటాయింపులు జరిపారు. రైతులకు పవర్ స్ప్రేయర్లు, హ్యాండ్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, నాగళ్లు, డిస్కులు, కేజ్ వీల్స్, రోటో పడ్లర్, రోటోవేటర్, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్స్,స్ట్రా బేలర్స్ వంటి పనిముట్లు అందించనున్నారు. రైతులు తమకు అవసరమైన పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించనున్నారు.

448 యూనిట్లే..?

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కోసం ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం యాంత్రీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో రైతుల్లో ఆశలు రేకెత్తాయి. ప్రభుత్వంఅరకొర నిధులు, తక్కువ యూనిట్లు కేటాయించటంతో తమవరకు ఈ పథకాలు వర్తిస్తాయో లేదోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దరఖాస్తులు వేలసంఖ్యలో వచ్చే అవకాశం ఉండగా, జిల్లాలో 448 యూనిట్లు మాత్రమే అందే పరిస్థితి ఉంది. లబ్ధిదారుల ఎంపిక కూడా వ్యవసాయశాఖఅధికారులకు కత్తిమీద సాములా మారనుంది.అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ప్రమేయం, స్థానికఎమ్మెల్యేల సిఫారసులు ఉంటేనే యాంత్రీకరణ పథకాలు అందే ఎరిస్థితులు కనిపిస్తున్నాయి.

నిధులు పెంచాలని రైతుల డిమాండ్

యాంత్రీకరణకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి యూనిట్ల సంఖ్యను పెంచాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రభుత్వం మొక్కుబడిగానే నిధులు కేటాయించటం సరికాదని పేర్కొన్నారు. ఏడేళ్లుగా యాంత్రీకరణకు నిధులు కేటాయించకపోవటంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతులు పాత పద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తున్నారు. కనీసం ఏజెన్సీ ప్రాంతాలలోనైనా యాంత్రీకరణకు ఎక్కువ నిధులు కేటాయించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

అర్జీలను పరిష్కరించాలి

గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన



గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు

కొత్తగూడెంఅర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- ప్రభుత్వం నుంచి రావాల్సిన భూమి ఇప్పించాలని జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు సూర్యదేవర రాజయ్య భార్య సీతమ్మ వినతిపత్రం అందజేసింది. పరిశీలించిన అదనపు కలెక్టర్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.
- అగ్నిప్రమాదంలో ఇల్లు, కుమార్తె వివాహం కోసం దాచుకున్న నగదు, బంగారం దగ్ధమయ్యాయని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జూలూరుపాడు మండలం సాయిరాం తండాకు చెందిన గుగులోతు వీరు అర్జీ అందించారు. అర్జీని పరిశీలించి చర్యలు నిమిత్తం హౌసింగ్ పీడీకి ఎండార్స్ చేశారు.
- పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయితీ వర్కర్ల వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో, ఖబరస్థాన్ స్థలానికి అనుమతి మంజూరు చేయాలని జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ యాకూబ్‌పాషా ఆధ్వర్యంలో వినతి అందజేశారు.
- ఇసుక అక్రమ తవ్వకాలను ప్రభుత్వం అరికట్టాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు రంగారెడ్డి, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య వినతి పత్రం అందజేశారు.
- కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందని, సబ్ రిజిస్ట్రార్ వ్యవహారశైలి, అవినీతిపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ జిల్లా సమాచార హక్కు చట్టం కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్ జూలూరి రఘుమాచారి ఫిర్యాదు చేశారు.
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అప్పగించాలని కోరుతూ బీఆర్ఎస్, తెలంగాణ మాలమహానాడు ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు.
- 2021లో తన తండ్రి మరణించాడని, ఆయన పేరు మీద ఎస్‌బీఐలో ఉన్న పంట రుణం మాఫీ చేయాలని జూలూరుపాడు మండలం వినోబా నగర్‌కు చెందిన గంగావత్ ప్రసాద్ విన్నవించగా.. దరఖాస్తును వ్యవసాయ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.
- భూక్యా పులి సింగ్, సరోజ అనే వ్యక్తులు తమ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నారని, విచారణ జరిపి తమకు పట్టా మంజూరు చేయాలని ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన కున్సోత్ అరుణ ఫిర్యాదు చేయగా, దరఖాస్తును టేకులపల్లి తహసీల్దార్ ఎండార్స్ చేశారు.
- వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయానికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్న భూమికి తన మరిది కందుకూరి నాగార్జున అడ్డుపడుతున్నాడని, తగిన చర్యలు తీసుకుని ఆలయానికి భూమి ఇప్పించేలా చూడాలని దమ్మపేటకు చెందిన కందుకూరి లక్ష్మీ నరసమ్మ అనే మహిళ ఫిర్యాదు చేసింది. అర్జీని పరిశీలించిన అదనపు కలెక్టర్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.

వాటర్ బాటిళ్లు ఏమయ్యాయి?

ఖమ్మం కలెక్టరేట్‌లో 150కిపైగా సీసాలు మాయం



గతంలో కొనుగోలు చేసిన బాటిళ్లలో ఒకటి..

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశాలకు హాజరయ్యే అధికారులు, ఉద్యోగులకు తాగునీరు సమకూర్చేందుకుగాను గతంలో విధులు నిర్వర్తించిన కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సుమారు 200 వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయించారు. అందరూ మిషన్ భగీరథ నీటినే తాగాలనే ఉద్దేశంతో వీటిని సమకూర్చారు. అయితే, అప్పుడొకటి.. ఇప్పుడొకటి అన్నట్లు బాటిళ్లు మాయమవుతుండగా ప్రస్తుతం 50కూడా లేవని సమాచారం. ప్రస్తుత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలెక్టరేట్‌ను ప్లాస్టిక్ ఫ్రీగా మార్చాలనే లక్ష్యంతో శాఖల వారీగా ఎన్ని స్టీల్ బాటిళ్లు కావాలో నివేదిక ఇవ్వాలని సూచించారు. దీంతో గతంలో కొనుగోలు చేసిన బాటిళ్లపై అధికారులు ఆరా తీయగా 200కు గాను 150మేర కనిపించడం లేదని తేల్చినట్లు సమాచారం. దీంతో ఈ బాటిళ్లు ఎవరు తీసుకెళ్లారు, ఎలా మాయమయ్యాయనే అంశంపై కలెక్టరేట్‌లో చర్చ జరుగుతోంది

తెలుగు అధ్యాపకుడికి డాక్టరేట్



వెంకటేశ్వర్లు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు పగిడిపల్లి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ లభించింది. కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆయన ‘డాక్టర్ సీతారాం సాహిత్యం – ఒక అధ్యయనం’ అంశంపై పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించగా కేయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లును కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా, అధ్యాపకులు, జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు తదితరులు సోమవారం అభినందించారు.

చెట్లు నరికివేతపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఉన్న చెట్లను నరికి తరలిస్తున్న ఓ వ్యక్తిపై సోమవారం అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఫారెస్ట్ రేంజర్ మురళి కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన కృష్ణ అనే వ్యక్తి కన్నాయిగూడెం సమీపంలో ఉన్న ఫారెస్టు కార్పొరేషన్ ప్రాంతంలో వంట చెరకు సేకరణ కోసం వెళ్లాడు. కార్పొరేషన్ పరిధి దాటి రిజర్వు ఫారెస్టులో ఉన్న ఏడు భారీ వృక్షాలను నరికి కలప లారీలో తరలిస్తుండగా పట్టుకున్నారు. కలప విలువ రూ.15 వేలు ఉంటుందని, లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశామని రేంజర్ తెలిపారు. అక్రమంగా చెట్లు నరికివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు శిక్ష

భద్రాచలంఅర్బన్: చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సోమవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పినపాక మండల పరిధిలోని బయ్యారం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు చెక్కు హామీగా ఇచ్చి బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన కనకయ్య వద్ద రూ.2.60 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో కనకయ్య కోర్టులో కేసు దాఖలు చేశాడు. భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ విచారణ జరిపి వెంకటేశ్వరరావుకు ఆరు నెలల జైలు శిక్ష విధించటంతోపాటు రూ.2.60 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చారు.

రైతుకు లాభాలు పెంచడమే లక్ష్యం

- అధికారుల అవగాహనతో ఫలితాలు
- వ్యవసాయ విస్తరణ సలహా సంఘం సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సదస్సులో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన డాక్టర్ బలరామ్ తదితరులు

వైరా: పంటల సాగునే నమ్ముకున్న రైతులు లాభాలు ఆర్జించడమే ధ్యేయంగా అధికారులు అవగాహన కల్పించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన మధ్య తెలంగాణ(ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మెదక్) మండల వ్యవసాయ పరిశోధనా విస్తరణ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15, 20ఏళ్లుగా రైతుల ఆదాయం గణనీయంగా తగ్గుతోందన్నారు. గతంలో వరిపై ఎకరాకు రూ.40వేల ఆదాయం వస్తే ఇప్పుడు రూ.20వేలు కూడా రావడం లేదన్నారు. దీనికి తోడు వాతావరణ మార్పులతోనూ వారు నష్టపోతున్నారన్నారు. ఈమేరకు ఆయిల్ పామ్, కూరగాయలు, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటలు సాగు చేయడం, ఆధునిక విధానాలు పాటించడంపై ఎప్పటికప్పుడు వివరించాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకుడు డాక్టర్ బలరామ్, విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎం.యాదాద్రి, మధ్య తెలంగాణ రీజియన్ సహాయ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, డీడీఏ సింగారెడ్డి, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, మధిర వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీ దేవి మాట్లాడారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్లు, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు, ఉమ్మడి ఖమ్మం, మెదక్, వరంగల్ జిల్లాల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఆర్ఈఏసీ సభ్యుడు రాణాప్రతాప్, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

మందులు కలిసిన నీళ్లు తాగి 22 గొర్రెలు మృతి



చనిపోయిన గొర్రెల వద్ద బాధిత యజమాని

రఘునాథపాలెం: దాహార్తితో అల్లాడుతున్న మూగ జీవాలు మందు కలిపిన నీళ్లు తాగగా మృత్యువాత పడ్డాయి. బాధితులు, గ్రామస్తులు కథనం ప్రకారం .. మండలంలోని కోయచలకకు చెందిన బొరిగర్ల లింగయ్య, బాబుకు చెందిన గొర్రెల మందను రోజూలాగే మేతకు తీసుకెళ్లారు. ఒక రైతు మిర్చి తోటలో మందుల పిచికారీకి నీళ్లలో కలిపి సిద్ధం చేసి ఉంచగా... గొర్రెలు ఆ నీళ్లు తాగాయి. దీంతో గొర్రెలు వరుసగా కింద పడిపోతుండడంతో కాపరులు వెంటనే పశు వైద్యుడికి సమాచారం ఇస్తుండగానే 20 గొర్రెలు, రెండు పోతులు ప్రాణం విడిచాయి. మిగిలిన వాటికి వైద్యం అందిస్తుండగా ఎన్ని కోలుకుంటాయో తెలియడం లేదు. సుమారు రూ.3.25 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని యజమానులు కోరారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



కార్తీక్(ఫైల్)

మణుగూరు టౌన్: ప్రేమించిన యువతి కాదనడంతో మనస్తాపానికి గురైన యువకుడు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం ... మండలంలోని వాసవీనగర్‌కి చెందిన సుగ్గల కార్తీక్(26) ఓ యాప్‌లో పరిచయమైన యువతిని ప్రేమించాడు. పెళ్లిచేసుకునేందుకు ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తల్లిదండ్రులు గుంటూరు వెళ్లగా, సోదరుడు మరో గదిలో ఉన్నాడు. గమనించి సోదరుడు స్థానికుల సాయంతో కిందకు దింపి 100 పడకల ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కాగా ఎదిగి వచ్చిన కుమారుడు ప్రేమ అంటూ ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. వారి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

మనస్తాపంతో వివాహిత..

పాల్వంచరూరల్: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధి సారెకల్లు గ్రామానికి చెందిన మడకం రాఖి(21) మద్యానికి అలవాటుపడటంతో భర్త రామ మందలించాడు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 21న పురుగుల మందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అక్కడి నుంచి కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ములకలపల్లిలో యువకుడు..

ములకలపల్లి: ఉరి వేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గుట్టగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. గుట్టగూడెం గ్రామానికి చెందిన గుండి భారతి, అర్జున్ దంపతులకు కుమారుడు చైతన్య (19), కూతురు కల్యాణి ఉన్నారు. చైతన్య చెడు వ్యసనాలకు గురై చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటుండగా ఆదివారం రాత్రి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది గ్రామ శివారులోని పాఠశాల ఆవరణలో నిద్రించేందుకు వెళ్లాడు. తెల్లవారుజామునే చెట్టుకు ఉరి వేసుకోగా, స్థానికులు గమనించి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక టిప్పర్లు సీజ్



అధికారులు పట్టుకున్న ఇసుక టిప్పర్

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్ వాహనాలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ వివేక్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని భోజ్యాతండా సమీపంలోని మొర్రేడు వాగు చెక్‌డ్యామ్ వద్ద నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందగా రూరల్ ఆర్ఐ నళిని కుమార్, పోలీస్ సిబ్బంది సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఒక రోజు ముందు తీసుకున్న అనుమతి కాగితాలతో రవాణా చేస్తుండగా టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

టేకులపల్లిలో ట్రాక్టర్...

టేకులపల్లి: మండలంలోని శంభునిగూడెం వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, ఇసుక రవాణా చేస్తున్న బిల్లుడుతండాకు చెందిన అజ్మీర మాన్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

చంద్రుగొండలో రెండు ట్రాక్టర్లు..

చంద్రుగొండ : మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులో ఉన్న ఎదుళ్ల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ సోమవారం రాత్రి తెలిపారు. వాహనాలను స్టేషన్‌కు తరలించామని, డ్రైవర్లు నర్సింహారావు, హేమంత్‌లపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో మండలవాసి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

దుమ్ముగూడెం : మండలంలోని సున్నంబట్టి గ్రామానికి చెందిన బంటు రాజ్‌కుమార్ (18) హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాజ్‌కుమార్ హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై హైవేపై వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. రాజ్‌కుమార్ మృతితో సున్నంబట్టి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పశువులు పట్టివేత

టేకులపల్లి: మండలంలోని తడికలపూడి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు పశువులను స్వాధీనం చేసుకున్నారు. ట్రాలీ వాహనం సీజ్ చేసి, నిందితులు గరుడపల్లి లాలయ్య, మొరం నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. పశువులను పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కరకగూడెం: మండల పరిధిలోని బర్దారం అటవీ ప్రాంతంలోని నరసింహస్వామి ఆలయ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వారి నుంచి రెండు సెల్ ఫోన్లు, రూ.7వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు కరకగూడెం ఎస్సై రాజేందర్ తెలిపారు.

జేసీబీ స్వాధీనం



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన జేసీబీ

దమ్మపేట : అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న జేసీబీ యంత్రాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. మండలంలోని గట్టుగూడెం గ్రామశివారులో అనుమతులు లేకుండా జేసీబీ యంత్రంతో మట్టి తవ్వి, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారనే సమాచారం రెవెన్యూ అధికారులకు అందింది. దీంతో రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, సీజ్ చేశామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి తెలిపారు.